సమానాంతర రేఖలు

చలమయ్య రెండోకూతురు రుక్కి కందిచేలో కూర్చుని గాభరాగా ఆలోచిస్తోంది. సంధ్యవేళ. ఊరు సద్దు మణిగిపోతోంది. తానేమో యిక్కడికి వచ్చేసింది. భయంతో గజగజ వణికిపోతోంది. తొందర్లోను, ఆవేశంలోను యేదో అనేసింది. ఏదో చేసేసింది. తన ధైర్యానికి తానే అచ్చెరువు పడుతోంది. బలీయమైన అవసరం, యెంతపనైనా చేయిస్తుంది. కాకపోతే తానెక్కడ! సూరిబాబు యెక్కడ! వళ్ళంతా గలతరించిపోతోంది. తాను చేసింది తప్పేమో! తన తండ్రికి తెలుస్తే యేమవుతుందో? ఊళ్ళోవాళ్ళకి తెలుస్తే యేమనుకుంటారో! అయినా మా అయ్య చెపుతూనేవుంటాడు వాళ్ళ సంగతి. నేను చేసినదాంట్లో తప్పేమీ లేదులే అనుకుని తృప్తిపడుతోంది. ఏమిటో, యెప్పుడురాని ఆలోచనలూ వస్తున్నాయి. ఒక్కసారిగా తన అరచెయ్యి చూసుకుంది. ఇంకా కందగడ్డలాగానే ఎర్రగావుంది. సూరిబాబు చెంపకంటె తన చెయ్యే బాగా కందిపోయిందనుకుంది. అరచెయ్యివైపు అట్టే చూస్తూవుంటే, సూరిబాబు చెంప అచ్చుగుద్దినట్లు కనిపిస్తున్నట్లుంది. కళ్లు చెదిరిపోయినాయి. శరీరం వణికింది. గబగబ అరచెయ్యి తుడిచేసుకుంది. ఇంకా ఆ ఎర్రదనం తగ్గటంలేదు. ప్రక్కనున్న తొట్టెలో చెయ్యికడుక్కుని పమిటకొంగుతో తుడుచుకుంది. ఇంకా ఆనమాలు కనిపిస్తూనేవుంది, భయం వలన చేసేదేమీలేక ఏడుపొచ్చింది. చేసింది తప్పుకాదని తన అంతరాత్మను వప్పించలేక పోవటంలో వుక్రోషంవచ్చింది; మళ్లీ వుక్రోషంవలనకూడా ఏడుపే వచ్చింది. చందమామ గుండ్రంగా కదులుతున్నాడు. ప్రక్కన తొట్టెనీళ్ళల్లో. తన వీపు యెవరో చరిచినట్లనిపించింది. చప్పున నీళ్లు కుమ్మరించేసి తొట్టె బోర్లించేసింది. పైనవున్న చందమామ తననుచూసి పక్కున నవ్వినట్లనిపించింది. చారడేసి కళ్లు, గులాబి రంగు చెక్కిళ్లు విశాలమైన నుదురు నిజంగా చలమయ్య కొంపలో తప్పబుట్టింది రుక్కి. నలుగురూ యిదేమాట అసలు చలమయ్యకు పుట్టిందవుతేగా! రామనాథంగారి పోలిక. అచ్చుగుద్దినట్లు కనిపిస్తోంది. ఇవన్నీ

వింటూంటే వురితీసుకుని చచ్చిపోదామని అనిపిస్తూ వుంటుంది రుక్కుకి. కాని ధైర్యంచాలటంలేదు. ఇంకా యేవేమిటో జ్ఞాపకంవస్తున్నాయి. ఇంటికి వెళ్ళటమా, వెళ్ళకపోవటమా మనస్సు యేమీ ఆలోచించుకోలేక పోతోంది. ఈ పాటికి తప్పకుండా అయ్యకు బాబుగారొచ్చి జరిగిన విషయం అంతా చెప్పే వుంటా రనుకుంది. ఏమిటో ఒక్కసారిగా రుక్కుకి యెక్కడలేని ధైర్యం వచ్చినట్లనిపించింది. పోనీ చెప్పనీ. దీంట్లో దాపరికం యేముంది. నేనూ చెపుతాను వున్నదంతా, నాకేమన్నా భయమా, ముందరవుతే నే నేమీ చెయ్యలేదు. తప్పంతా అయ్యగారిదే. ధైర్యం తెచ్చుకుంది. పమిటకొంగు విదిలించేసి నడుముకుచుట్టేసుకుంది. చెదిరిన ముంగురులను వెనక్కు నెట్టేసి, మాటిమాటికి అరచేతిని చూసుకుంటూ ఇంటిదారి పట్టింది రుక్కు. పైకి కనిపిస్తున్నంత ధైర్యం లోపలనుంచి రావటంలేదు. అందువల్లనే బెరుకుగానే అడుగులువేస్తూ, ఒక్కొక్కప్పుడు అంగలువేస్తూ ధీమాగా బయలుదేరింది. ఎవరో ఒకళ్ళిద్దరు రుక్కుని చూసి వ్యంగ్యంగా నవ్వారు. తన మనస్సులో ఇంకోటేమీ ఆలోచించే పరిస్థితిలో లేదు. ఏమీపట్టించుకోకండానే చరచర నడిచి వెళ్ళిపోతోంది.

చలమయ్య సాధారణంగా, ప్రొద్దుగుంకగానే వేపచెట్టుక్రింద నులక కుక్కి వేసుకుని కూర్చుని, చేతిక మూతికెపట్టని చుట్టపీకతో సాముచేస్తూ వుండేవాడు. అట్లాగే చెయ్యి మూతి కాల్చుకుంటూ; నివురుగప్పిన నిప్పు కనిపించకండానే పొగవదులుతూ వుండేవాడు. ఏమిటయ్యా, ఇంట్లో అంత పొగాకు పెట్టుకుని, ఆ చుట్టముక్క కాల్చుకుంటా వెందుకు అని అంటూ వుండేది రుక్కు. అలాంటిది, చలమయ్య అక్కడ లేనేలేదు. రుక్కు మాత్రం వచ్చి వాకిట్లో నుంచుంది. రోజూ ఉంటున్న యిల్లే క్రొత్తగా కనిపించింది. సరాసరి లోపలకు పోవటానికి మనస్సు వప్పటంలేదు. అటూ ఇటూ ఆదుర్దాగా చూస్తూ నుంచుంది. ఇంట్లోంచి సూరిబాబు కమతగాడు కస్సు బుస్సులాడుకుంటూ బైటకు వస్తున్నాడు. రుక్కు పైప్రాణాలు పైకి ఎగిరిపోయినాయి. తన శరీరం కనిపించకండా, వేపచెట్టు ఆశ్రయం యిచ్చి దాచేసింది. రుక్కుకి

ఏమిచెయ్యాలో యేమీ పాలుపోవడంలేదు. అట్లాగే యింటిలోనికి తొంగి తొంగి చూస్తూ నుంచున్నది. గంగి, గంతులు వేసుకుంటూ బైటకు వచ్చేసింది. అటూ ఇటూ ఓసారి చూసి, వేపచెట్టు క్రింద నులక కుక్కి లాగి, దానిమీద బరువుగా వత్తిగిలింది. అమ్మకూడా కోపంగానే బైటకు వచ్చేసింది. చలమయ్యా, చప్పబడ్డ చుట్టపీకెను, రెండు పళ్ల మధ్య కరిచి పట్టుకుని, వికృతంగా మొహంపెట్టి, యేమిటో అట్టహాసంగా వచ్చేశాడు. బైటకువచ్చిన ముగ్గురూ కూడా మూడు రకాలుగా మొహాలు పెట్టి మొటమొట లాడుతున్నారు. రుక్కి చెట్టుచాటున నక్కిందన్న మాటేగాని, యెంతసేపని అక్కడ అట్లా వుండిపోతుంది కనక! ఈ ముగ్గురిదగ్గర మొహం యెట్లా చూపిస్తుంది. ఉక్కిరి బిక్కిరయి పోతోంది. అమ్మ, నులకమంచం దగ్గరగా చతికిలబడింది. చలమయ్యా వీధి గుమ్మం గగ్గరగా నడుస్తున్నాడు. సమయం చిక్కింది గదా యెవరూ చూడకుండా తాను యింట్లోకి జొరబడొచ్చు గదా అని అడుగుతీసి అడుగు లేస్తూ రుక్కి యింటి లోపలివైపుకు పోసాగింది. చలమయ్యా గబుక్కున యెందుకో వెనక్కి తిరిగాడు. రుక్కి చటుక్కున నిలబడిపోయింది.

'ఏం రుక్కి యింటికి రావటానికి ఏళాపాళా లేదేంటి...' చలమయ్యా కస్సుమన్నాడు.

గంగి, అమ్మ యిద్దరు కూడా రుక్కి వైపుకు తిరిగారు.

"ఈ యాళదాకా యేం చేస్తుండావే..." గంగి కోరచూపులతో అడిగింది.

రుక్కి గతుక్కుమంది.

"ఏమిటి అట్లా దూసుకు పోతున్నావు" అమ్మ వికటంగా అడిగింది.

రుక్కి యేమీ మాట్లాడలేదు.

"నలుగురు కళ్లల్లోపడి నాశనమైపోదామనుకుంటున్నావా...గంగి చేసిన రభస చాలు......ఇహ నువ్వు కూడా......" చలమయ్యా ముందుకు అనలేక పోయాడు.

"ఇంటికాడా కూకుంటే పొట్టగడిచే దెట్టా...తానేమో యేమీ చిల్లిగవ్వకూడా సంపాదించి పెట్టలేదు. పోనీ యెవరైనా సంపాదించుకుని వస్తుంటే, చూసి వోర్వలేదు. గంగికేమీ సుఖంలేదు. తన శరీరం అమ్ముకుని, నిన్ను నన్ను పోషిస్తోంది. ఆ మాత్రం యిదిలేదు, నీకు, పైగా దాన్ని నానా మాటలు అనటం, దానికి పెళ్ళిచేసి దానింటికి దాన్ని పంపిస్తే సుఖపడక పోయిందే మిటి...చేతగాని చవట. ఆత్మను అమ్ముకుని, వాళ్లకు వీళ్ళకు తొత్తుగావుంటూ మనకు సహాయం చేస్తున్నాకూడా నీకు జాలిలేదు. పైగా గౌరవం, మర్యాద, వంశం యేమిటేమిటో సణుగుతావు. అవన్నీ దానికి మాత్రం లేవేంటి? నీ కంటె యెక్కువేవున్నాయి తిండే గడవద్దూ...మొహానికి సిగ్గుండాలి..." అమ్మధోరణి చాలా తీవ్రరూపంలోకి వచ్చేసింది.

"అయ్యకంటె ఆ బాబుగార్లే ప్రేమగానూ, గౌరవంగానూ చూస్తారు..." గంగి యింకా యేవేమిటో జాడిస్తూనే వుంది.

రుక్కివెంటె, చలమయ్యకూడా లోపలికి వెళ్ళాడు బరబరా, యీ అంటున్నవన్నీ యెవర్నో అన్నట్లు.

"ఏమే రుక్కు...నిజం చెపుతావా చెప్పవా" చలమయ్య నిలవేశాడు.

రుక్కి వళ్లంతా వేడెక్కిపోయింది.

"నువ్వేంచేసొచ్చావు...ఇంతసేపటిదాక యెక్కడున్నావు...సూరిబాబుగారింటికి వెళ్ళదాంపద...నాకు అన్నీ తెలుసు. నాకళ్లకే గంతలు గడదామనుకుంటున్నావా? గంగిని యిప్పుడు నే నేమి అనేట్టులేదు. నిజం చెప్పు..." చలమయ్య రుక్కిని వూపిరి ఆడనీయటం లేదు.

రుక్కికి, తన తండ్రికి జరిగిన విషయం అంతా తెలిసిపోయిందేమో అని భయంగా వుంది. ఆసమయంలో రుక్కికి నిజం చెప్పాలో అబద్ధం చెప్పాలో తెలీకండా వుంది. ఇంతలోకి, గంగి, అమ్మకూడా లోపలికి వచ్చేశారు.

"ఏమిటా నిలవెయ్యటం...నాకు అంతా తెలుసు. నేను కనుక్కుంటాన్లే నువ్వుపద..." అమ్మ చొరవచేసుకొని చలమయ్యను వెనక్కు నెట్టేసింది.

రుక్కకి యేమీ అర్థం కావటం లేదు. తన తండ్రి అడిగే ప్రశ్నలకు గాని, అమ్మ చెప్పే సమాధానానికి గాని పాత్రేమిటో రుక్కకి భోధపడటం లేదు. ఆ సమయంలో మాత్రం, తప్పించుకుని బైటపడ్డాను. అని లోపల లోపల సంతోషించింది. చలమయ్య కోరచూపులు చూస్తూ, వాకిట్లో అరుగుమీద కూలబడ్డాడు.

"అమ్మా..." అని పిలిచింది. రుక్క యెంతో ఆవేదనగా.

"అమ్మాయి రుక్క నాకు అంతా తెలుసు...నువ్వేమి చెప్పకర్లేదు,"

గంగి యేమిటో చెప్పబోయి ఆపేసింది.

రుక్కకి అంతా అయోమయంగా వుంది. ముందు ముందు యేమవుతుందో అనే భయం పట్టుకుని పీడిస్తోంది. తాత్కాలికంగా అప్పటికప్పుడవుతే యెట్లాగైతే బైటపడింది. మనస్సులో దిగులు, భయం స్థావరాలు యేర్పరచుకున్నాయి. ఆ రాత్రంతా రుక్క మనస్సంతా కలవరపడిపోతోంది. నిద్ర పట్టటం లేదు. చాపమీద అటూయిటూ దొర్లిపోతోంది. మధ్య మధ్య లేచి, కాసిని మంచినీళ్లు త్రాగి మళ్ళీపడుకుంటోంది. తెల్లారుతుంది. మళ్లీ బాబుగారింటికి పనికి వెళ్ళాలి. పనికి వెళ్లితే, బాబుగారు వూరుకోరు తన్నేమన్నా చేస్తారు. పోనీ పనికి వెళ్ళనంటె, అయ్య, అమ్మ, వూరుకోరు. వెళ్ళననటానికి కారణాలు యేం చెప్పాలి. అక్క కూడా వప్పుకోదు. పరిపరివిధాల ఆలోచిస్తూ కళ్లుమూసింది, అప్పటికే తెల్లవారిపోయింది.

"రుక్కా! యింతసేపైనా నిద్దర లేవవేమిటే..." లెగు...రుక్కన్ని తట్టి, అమ్మ నిద్రలేపుతోంది.

రుక్క బద్ధకంగా అటూయిటూ సాగి, కళ్లు నలుపుకుంటూ లేచి కూర్చుంది.

"ఒక్కనాటికే యిట్లా అయిపోయినావేంటే...అమ్మ, రుక్కని చూసి నవ్వుకుంది.

అమ్మవంక అదోరకంగా చూసి, రుక్క ప్రక్కవదలి పెట్టేసింది.

అమ్మ, గంగితో యేమి టేమిటో చెప్పుతూ సంబరపడి పోతోంది. గంగి కూడా తెలిసినట్లు నవ్వేసింది. చలమయ్య వీళ్లిద్దర్ని చూసి చిట చిట లాడి పోయాడు.

"ఇయ్యాల పనికి వెళ్లవేంటె...ఎంత పొద్దెక్కిందో చూశావా... రుక్కిని, సూరిబాబుగారింటికి వెళ్లమని ప్రోద్బలం చేస్తోంది అమ్మ.

"అమ్మ!...తలకాయనెప్పి బాగా యెక్కువగా వుందే. ఇయ్యాల యెక్కడికీ వెళ్లలేనే..." తలకాయ గట్టిగా పట్టుకుని వున్నచోటనే చతికిల పడింది రుక్కి.

అమ్మ మళ్లీ నవ్వుకుంది. జుట్టు నిమురుతూ పోనీలే యివ్వాళిటికి అక్క వెళుతుందిలే అన్నది అమ్మ; రుక్కికి ప్రాణం యెంతో తేలికగా అని పించింది.

ఆ నాడు ఉదయం గంగేవెళ్ళి అక్కడ పనులన్నీ చూసుకుని వచ్చింది. మధ్యాహ్నం దాటినప్పటినుంచి మళ్ళీ రుక్కికి. గుండె అదురు యెక్కువయింది. సాయంత్రానికి యేమి సంక చెపుదామా అని ఆలోచిస్తోంది. ఎట్లాగైనా అక్కనే కోరుకుందాం సాయంత్రం కూడా వెళ్లి పనిచెయ్యమని అనుకుంది రుక్కి. గంగి, రుక్కి కోరినట్లుగానే చేసింది. కాని మళ్లీ తెల్లారుతుంది. తాను పనిలోకి వెళ్ళాలి. అప్పుడేం చెయ్యటం ఈ ఆలోచన ఆ రాత్రినుంచే ప్రారంభమయింది రుక్కికి. ఎన్నాళ్లు యిట్లా గడపటం అనుకుంది. ఏదో ఒక నాడు యిది బైట పడకమానదు. నలుగురు నాలుగు మాటలు అనటం తప్పదు. ఎట్లాగైనా ధైర్యం చేసుకుని ముందుకు పోవాలని నిశ్చయం చేసుకుంది. అంతగా బాబుగారు. అడుగుతే వున్నది వున్నట్లు చెప్పేద్దాం నలుగురికీను. అప్పుడే తప్పెవ్వరిదో అందరికీ తెలిసిపోతుందని, గుండె నిబ్బరం చేసుకున్నది. రుక్కి.

భల్లున తెల్లారింది. ఎవరి పనుల్లో వాళ్లు నిమగ్నులయి పోయారు. రుక్కి అదివరకు వెళ్లినట్లుగానే సూరిబాబుగారింటికి పనికివెళ్లింది. కసువు వూడ్చి ముగ్గేసింది. గదులు చిమ్మి చెత్త అవతల పారపోసింది. ఒకటో

రెండో బట్టల్ని బండకేసిబాది ఎండలో ఎండేసింది. చెంబులు గిన్నెలు తోలిచి యింట్లో పెట్టేసింది. ఇన్ని పనులు చేస్తుండగానే ఎప్పటి కప్పుడు రుక్కి మనస్సులో ఓ విధమైన ఆవేదన, భయం, తొట్రుపాటు, పెల్లుబుకు తూనే వున్నాయి. కాని యెవరూ కూడా తన పనికేమీ అడ్డంరాలేదు. సూరిబాబుగారు అసలు కనిపించనే కనిపించ లేదు. రుక్కికి భయం కంటె ఆశ్చర్యం యెక్కువ అయింది. తాను వూహించుకున్నట్లు యేదీ జరగలేదు. పైపెచ్చు. సూరిబాబే కనిపించలేదు రుక్కికి వుక్కిరి బిక్కిరి అయినట్ల యింది. మామూలుగానే వెళుతున్నా అమ్మగారు అని చెప్పి వచ్చేసింది రుక్కి. సాయంత్రం కూడా చెప్పతగ్గ మార్పేమీ కనిపించలేదు, రుక్కి పనిలో అయితే ఆ పని యీపని చెప్పటంవలన, ఆ సాయంత్రం రోజూకంటె కొంచెం ఆలస్యంగానే యింటికి వచ్చింది.

ఎదురుగా చలమయ్య వచ్చేసి, "ఇంతసేపటిదాకా యేంచేస్తున్నావు" అని ప్రశ్నించాడు.

'అమ్మగారు యేవో పనులు చెప్పారు. అందుకని ఆలస్యం అయింది.' తొణక్కుండా నిదానంగా సమాధానం చెప్పింది రుక్కి.

చలమయ్యకు ఆ సమాధానం యేమాత్రం కూడా తృప్తిగాలేదు. పైగా అది అబద్ధం అని కూడా అనుకున్నాడు. ఇంతలోనే అమ్మ యింట్లోంచి వచ్చే సింది.

"రుక్కి వచ్చావమ్మ! నీ మాటే అనుకుంటున్నా..." బుజాన చెయ్యి వేసి, అమ్మ, రుక్కిని లోపలికి తీసుకు వెళ్లింది.

"సూరిబాబుగారు యేమన్నారు......" అమ్మ నవ్వుతూ అడిగింది.

రుక్కి యేమీ మాట్లాడలేదు.

"అమ్మకు యెక్కడలేని సిగ్గు......" అమ్మ, రుక్కి, చెక్కిళ్లను గట్టిగా వత్తి లోపలికి వెళ్ళిపోయింది.

రుక్కి యెంతో తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టింది. అమ్మ ధోరణి తనకేమీ అర్థం కావటంలేదు. లేకపోయినా. సమయానుకూలంగా, అవుననో, కాదనో సమాధానం చెప్పి, ఆవేళకు తప్పించుకుంటూ వస్తోంది. ఒకటి రెండు రోజులు గడిచిపోయినాయి.

రుక్కికి మనోవేదన యెక్కువయిపోతోంది. ఇంట్లో చూడపోతే అమ్మ ధోరణి ఒకవిధంగా వుంది, తండ్రి ధోరణి యింకోవిధంగా వుంది. బాబుగారింటికి పనికి వెళితే అక్కడవాళ్లు కూడా ముక్తసరిగా మాట్లాడి ముభావంగా వూరుకుంటున్నారు. సూరిబాబుగారవుతే కనిపించనే కనిపించటంలేదు. బాబుగారెక్కడ అని యెంత అమాయకంగా అడిగినా, ఆ ప్రశ్న యెన్నివిధాల యెంతమంది అర్థం చేసుకుంటారో అనే భయం. రోజురోజుకు రుక్కి నలిగి నలిగి పోతోంది. నాలుగైదు రోజులు తెచ్చి పెట్టుకున్న భయంతో గడిపేసింది.

ఆనాడు పనెక్కువవటంవలన, ఆయాసపడుతూ అలసిపోయి యింటికి వచ్చింది రుక్కి బద్ధకంగా వాకిట్లో మంచంమీద నడుము వాల్చింది. చలమయ్య ఆనాడు అప్పటికి యింటికి రాలేదు. ఆరాత్రికి గంగి యింటికి రాదని అమ్మకు తెలుసు అమ్మవక్కత్తే యింట్లో వుంది. కొడిగట్టిన దీపాన్ని కోసేసి, చమురు నిండా పోసి ఓలాంతరు వెలిగించి సావిట్లో పెట్టింది. ఉండి ఉండి గప్పు గప్పు మంటోంది. నేలకేసి గట్టిగా రెండుసార్లుకొట్టి, ఆ లాంతరును వీధి గుమ్మం దగ్గరకు తీసుకువచ్చేటప్పటికి, మంచంలో పడుకునివున్న రుక్కి కనిపించింది.

"రుక్కీ ఎప్పుడొచ్చావే...ఎంతసేపయిందేమిటి..." అమ్మ లాంతరు పట్టుకుని మంచం దగ్గరకు వచ్చింది. రుక్కి అలిసిపోయి, మొహం యెంతో నీరసంగా కనిపించింది.

అమ్మ పమిటికొంగుతో రుక్కి మొహంఅంతా తుడిచేసి మెల్లిగా లోపలికి తీసుకుపోయింది.

"రుక్కీ! అట్లా రోజు రోజుకు నలిగిపోతున్నావేమిటి...బాబుగారు నీతో చక్కగా మాటలాడుతున్నారా...వారి దయ మనకుండాలే గాని, మనకు తక్కువేంటే...ఇంకా నువ్వు చిన్నపిల్లవి. నీకుబాగా తెలీదమ్మా..., అంత సిగ్గు వుండకూడదు. ఎంతయినదైనా అయ్యగారితో చనువుగా వుండి వారిని మెప్పించావంటే, యింకా మనకు యేలోపమూ వుండదు...ఏమిటి నేను చెపుతోంది తెలుస్తోందా"...అమ్మ నవ్వుతూ, రుక్కుని అడిగింది.

రుక్కు ఎందుకనో బలవంతంగా చిరునవ్వు తెప్పించుకుని అమ్మవంక చూసింది.

అమ్మ పకాలున నవ్వింది.

ఆరాత్రి రుక్కుకి తీవ్రమైన ఆవేదన కలిగింది. అమ్మ అంతరార్థం పూర్తిగా తెలుసుకుంది. ఏకారణంచేత అమ్మను, తాను ఏవగించుకుంటోందో మళ్లీ ఆవిషయాన్నే ప్రోత్సహిస్తూ తనదగ్గర ప్రస్తావించటం, రుక్కుకి యెంతో వికటంగా అనిపించింది, ఖచ్చితంగా తన అమ్మకి చెప్పెయ్యాలనుకుంది. తన అమ్మమీద తనకు యెన్నడూరాని కోపంవచ్చేసింది. తాను ఒక యింటిదైతే భర్త కొంగుపట్టుకుని చెమటోడ్చి పనిచేసి యింత గంజి త్రాగలేకపోదు. తన శరీరంలో మంచి ఓపికవుంది. కష్టించి పనిచెయ్యగలదు తన బ్రతుకు తాను బ్రతకకలదు. మరీ యీ నీచమైన బ్రతుకు అమ్మ తనకు యెందుకు ఉద్బోధిస్తోంది, తమస్వార్థంకోసం. అక్కను అనవసరంగా అల్లరిపాలుచేశారు. ఈనాడు అక్కంటే నలుగురు యేమనుకుంటున్నారో అర్థం కావటంలేదు. కడుపుకులేని యింట్లో పుట్టాం కడుపుకోసం కష్టంచెయ్యగలం. ఇంకా మనకు లోటేమిటో. ఇతరులను మెప్పించాలని, యెవరికోసమో కూడబెట్టాలని, మనం నాశనమయిపోవటం యెందుకో అర్థంకావటంలేదు. నా జీవితం, నన్ను చూసి మురిసిపోయిన వాళ్లందర్నీ మెప్పించటానికికాదు. నా జీవితం నా కోసం, నా ఆనందంకోసం. అంతే. అమ్మకు యివన్నీ చెప్పేసేస్తాను. మళ్ళీ ఆ విషయం నాదగ్గర తీసుకురాకుండా చేస్తాను. ఏమిటేమిటో ఆరాత్రల్లా అనుకుంటూనే వుంది. లోపలలోపల కృషించి పోతూనేవుంది.

చిరాకుగా లేచి, రేగిన జుట్టుకు యింత నూనె పట్టించి బైముకు సూరిబాబుగారింటికి వెళ్లిపోయింది రుక్కి. వీధిగుమ్మం తీసేవుంది. లోపలికి వెళ్లిపోయింది. కాని యేమిటో భయమేస్తోంది. ఆ యిల్లు ఆ ఒక్క రాత్రిలోనే యెంతో మారిపోయినట్లనిపించింది. చెప్పలేని భయం, రుక్కిని ఆవహించింది. ఆయింట్లో కనిపిస్తున్న ఒకరిద్దరు వ్యక్తులు భయంకరంగా కనిపిస్తున్నారు. తప్పటడుగులు వేసుకుంటూ, పని లోకివెళ్లింది వాకిట్లోకి యింతలో ఓ బండీవచ్చి ఆగింది. ఇంట్లోంచి ఓ ముసలావిడ, యింకో నడివయస్సు వ్యక్తివెళ్ళి బండీలో యెక్కారు. బండీ సాగిపోతోంది. రుక్కి అదేపనిగా అట్లాచూస్తూ నిలబడిపోయింది. వెళుతున్న బండీని సాగనంపటానికి కొంచెం ఆలస్యంగా లోపల్నుంచి సూరిబాబు వచ్చి, చెయ్యివూపి మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు రుక్కి, సూరిబాబును మళ్ళీ చూడటం అదే మొదటిసారి. వళ్లు ఝల్లుమన్నది. ప్రక్కకు తప్పుకుంది. సూరిబాబు నిరామయంగా లోపలి గదిలోకి వెళ్లి కూర్చున్నాడు. రుక్కి హృదయంలో ఆవేదన అలలాగ పైకి వుబుక్కి వస్తోంది. చకచక ఆ పని యీ పని చేసుకుపోతోంది. సూరిబాబు కూర్చున్న గది గుమ్మం దగ్గరకు వచ్చేటప్పటికి, రుక్కి ఆగిపోయింది. తన అరచెయ్యి మళ్ళీ చూసుకుంది. ఇంతలోకే సూరిబాబు లోపల్నుంచి బైటకు వచ్చేసి, తలవంచుకుని గంభీరంగా దిగి వెళ్లిపోయాడు. రుక్కి, సూరిబాబు కళ్ళల్లోవున్న గంభీరతను భరించలేక పోయింది. రుక్కికి హృదయం బ్రద్దలయినట్లనిపించింది. వళ్లంతా గజగజ వణికిపోయింది. తనకు తెలీకండానే తన శరీరం తడిసిపోయింది. పెద్ద నిట్టూర్పు విడిచి యింటికి వెళ్లిపోయింది.

రోజు రోజుకి రుక్కి నన్నపడిపోతోంది. మనోవ్యాధి యెక్కువయిపోతోంది. మనిషి చేసిన తప్పు పనిని ఎదిరిస్తూవుంటే ఆ తప్పు పనిని సమర్థించే శక్తి అతనిలోనుంచి బహిర్గతం అవుతుంది. అలాంటి తప్పు పనిని, యే ఒక్కడూ కూడా విమర్శించకండా, యెవరూ పట్టించుకోకండా వుంటే, మానవుల్లో అంతర్గతంగా వుంటున్న ఆ మనోదౌర్బల్యం సన్నగిలి పోతుంది. పశ్చాత్తాపానికి, పరితాపానికి అవకాశం కలుగుతుంది. తాత్కాలికంగా

అహంకారం పెరిగిపోయినా. రాను రాను, తాను చేసిన తప్పును యెంతో ఘోరంగా చిత్రించుకుని పశ్చాత్తాపపడి ప్రాణాలు తీసుకుంటారు. ఇదో రకపు మనోప్రవృత్తి. ఇలాంటి ప్రవృత్తిలోపడి తన్నుకుపోతోంది రుక్కి. సూరిబాబు తనను యేమి యేమిటో చేస్తాడని, తన తల్లి, తండ్రి, యింకా యితరులు, తనను యేదో ఆడిపోస్తారని అనుకున్న రుక్కి అప్పట్లో, తాను చేసినపని చెడ్డదికాదు అని రుజువు చెయ్యటానికి తగిన సామాగ్రిని చేకూర్చుకుంది. ఈ నాడు ఆ విషయం యెవరూ పట్టించుకోవటంలేదు. సూరిబాబే, తన యెదుట నుంచి, తలెత్తకండా గంభీరంగా వెళ్ళిపోయాడు. రుక్మి మరింత పిచ్చిదాన్ని చేసింది యీ సంఘటన. తాను చేసింది నిజంగా తప్పేమో. సరిగ్గా అర్థం చేసుకోలేదేమొ, ఏమైనా తొందరపడ్డానేమొ, యేమిటో యేమిటో రుక్కి పిచ్చిదానిలాగ ఆలోచిస్తోంది. ఆమెలో ఆవేదన పశ్చాత్తాపానికి దారితీస్తోంది. కాని యేం చెయ్యాలో తోచటంలేదు.

ఆనాడు కూడా మామూలుగానే సూరిబాబుగారింటికి వెళ్ళింది. పనులేవో తన చిత్తం వచ్చినట్లు చేసుకుపోతోంది. మనస్సు మథించుకుపోతోంది మెల్లిగా మేడమీద గదికి వెళ్ళటానికి మెట్లు యెక్కుతోంది. అంతపెద్ద యింటిలోను సూరిబాబు తప్ప యింకా యెవ్వరూ లేదు. నిశ్చలంగా ఏమిటో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు సూరిబాబు.

సూరిబాబు జీవితం మహా తమాషా అయినది. అతని మానసిక ప్రవృత్తి బహు చిత్రమయినది. జీవిత లక్ష్యం యేమిటో నిశితంగా ఆలోచిస్తూ వుంటాడు. తనకు గ్రాయకం వచ్చినప్పటినుంచి, తాను నిర్దుష్టమైన విషయావృత్తాలలో విహరిస్తూ, ఆలోచనలు చేస్తూ వుండేవాడు. ఆలోచిస్తున్న కొద్దీ, ఆస్తి, ధనం, మానవజీవిత పురోభివృద్ధికి ఆటంకాలు అని నిశ్చయానికి వచ్చాడు. ఆయేడే అతని తాలూకు యెవరో దాయాది పోవటంవలన, ఏభై ఎకరాల ఆస్తి, ఓ పెద్ద తోట ఇతనికి సంక్రమించినాయి. నలుగుర్లో కలిసి తిరగాలని వుబలాట పడ్డాడు. ఆత్మీయులకోసం, సూరిబాబు యెంతో పరితపించిపోయాడు. తాను ప్రాణంతో సమానంగా చూసుకుంటున్న తన అన్న

అకస్మాత్తుగా తనను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. తన తల్లితండ్రులు తనను పూర్తిగా అర్థంచేసుకుని తన పురోభివృద్ధికి యెంతో దోహదం యిస్తారని కలలు కంటూ వుండేవాడు. కాని తన తండ్రి తనకు గ్రాయకం వచ్చినప్పటినుంచి పెళ్ళి చేసుకోమని యింట్లో పోరుపెడుతూ వుండేవాడు, తనతల్లి దానికి వత్తాసుగా నీతులు బోధిస్తూ వుండేది. కాలగర్భంలో యిద్దరూ కలిసిపోయారు. ఆ స్త్రీని ఆసరాగా పెట్టుకుని, ఆత్మీయత పలకబోయాలని, చాలామంది విఫలంగా ప్రయత్నించారు. ఆత్మీయత అనేది డబ్బుతో కొనేదికాదని సూరిబాబు యెన్నడో గ్రహించాడు. ఇలా తన జీవితం సుఖమయం చేసుకోవటానికి కృతనిశ్చయుడై వుండిపోయాడు. ఆ సమయంకోసం యెంతో వోపిగ్గా కనిపెట్టుకు కూర్చున్నాడు. ఆ సమయం వచ్చిందనుకున్న తరుణంలో, అతను పూర్తిగా దెబ్బతిన్నాడు. తాను ఊహించలేని విషయం జరిగింది. దానికి కారణమేమిటి? బాధ్యత యెవరిది? తానెంతవరకు బాధ్యుడు! సంఘంలో మానవునికి మానవునికి ఇనుపతెరలెందుకు! ఇవి సృష్టించిన వాళ్ళెవరు? వీటిని విచ్ఛిన్నంచేసే శక్తి యెవరికుంది? గుణాలన్నీ డబ్బునే అంటిపెట్టుకుంటాయా? గుణహీనులలో డబ్బునే అంటిపెట్టుకున్నవాళ్లు యెంతమంది? జీవితంలో ధ్యేయం యేమిటి! నిజమైన ప్రణయానికి విలువలేక పోవటం, తుచ్ఛమైన కామానికి విలువ వుండటం! ఈ విరుద్ధభావాలెందుకు? ఒక స్త్రీ, అబల తిండికి వెతుక్కునే అభాగ్యురాలు, రూపసి, ఆమెలో నేను ఊహించలేని శక్తి యెవరు యిచ్చారు? కృత్రిమ బంధనాలలో బిగించేసి, యితరుల సౌభాగ్యాన్ని చూడలేని కొంతమంది స్వార్థపరులతో ఏర్పడిన సంఘమా? అర్థంలేని ఆవేశంలో, తన బాగు యేమిటో తాను తెలుసుకోలేని ఒక అమాయకపు పిల్ల క్రౌర్యమా! ఇంత డబ్బున్నా, జీవితంలో నేను యెందుకు సుఖపడటం లేదు. నాకు వ్యక్తుల్లో విశ్వాసం నశించింది. సంఘంమీద గౌరవం లేదు. నేను కూడా ఒక నిస్సహాయుడు లాగ సంఘపు వురిత్రాడులో యేనాడో ఒకనాడు చిక్కుకు పోవాల్సిందే! ఆలోచించి ఆలోచించి అలసిపోయాడు. చివాలున కుర్చీలోంచి లేచాడు. కిటికీ తలుపులు వేసేశాడు. బైటకు రాబోతున్నాడు ఎదురుగా రుక్కి నిలబడి ఉంది. ఒక్కక్షణం తీక్షణంగా చూశాడు రుక్కి వంక. వెక్కి వెక్కి యేడ్చి, కాళ్ళమీద పడింది క్షమించమంటూ.

పెద్ద నిట్టూర్పు విడుస్తూ, నిశ్చలంగా నిలబడిపోయాడు.

"అయ్యాగారు, అయ్యాగారు" అంటూ వలవల యేడ్చింది రుక్కి.

సూరిబాబు యేమీ చలించకుండానే అట్లాగే నిలబడి ఉన్నాడు.

రుక్కి మళ్ళీ పిలిచింది.

సూరిబాబు తీక్షణంగా చూశాడు మళ్ళీ ఓ సారి రుక్కి కళ్ళల్లోకి.

"రుక్కీ! లోకం నన్ను ఏమిటేమిటో అంటోంది. నీకు వినిపిస్తోందో లేదో నాకు తెలీదు. నేను నీ జీవితాన్ని నాశనం చేశానట. నీ పొంగి పొరలుతున్న యౌవనం, నేను చూసి సహించలేక నీకు తీరని అన్యాయం చేశానట దానికి ఫలితమే నువ్వు రోజు రోజుకు యిట్లా అయిపోవటంట. నామీద మంచి విశ్వాసం వున్నవాళ్ళే నన్ను యీ విధంగా తూలనాడుతున్నారు. నీతో పరిచయంవుందనే ప్రచారం చాలా తీవ్రంగా సాగిపోతోంది. నా గౌరవానికి, నా ఆత్మకు అలాంటి పరిచయం యెంతో వంచన అని యీనాడు గ్రహించుకోకలిగాను. నీ జీవితం అంతా సుఖమయం చేద్దామని నా జీవితం సుఖమయం చేసుకుందామని, మానవులు కల్పించిన బంధనాలన్నింటినీ త్రుంచివేసి, యెంతో వున్నతమైన ఆదర్శంతో నిన్ను పెళ్ళి చేసుకుందామని ఆశించి నీ దగ్గరికి వచ్చాను. కాని నువ్వు అపార్థం చేసుకున్నావు నన్ను. నా డబ్బు నా ఆస్తి నా ధనం, నన్ను సరిగ్గా అర్థం చేసుకో నీయలేదు. అది నీ తప్పేంగాదు. కాని యీ నాడు నాకు తగినశాస్తి జరిగింది. నీ జీవితంలో నిప్పులు పోస్తాననే దురభిమానంతో, నా జీవితాన్ని నాశనం చేశావు నా మనస్సులో క్షోభ పుట్టించావు. ఈ దావాగ్ని యీ జన్మను క్రమక్రమేణా దహించుకు పోతుంది నాకు తెలుసు. నా జీవితంలో నేను కోరుకున్నవి యేవీ జరగలేదు. అన్నింటిని సహించి, చివరకు నీ ప్రేమకోసం తపన పడ్డాను. అది కూడా నాకు లభ్యంకాలేదు. నేను నిన్ను ప్రేమించటం నా స్వార్థం కోసమే కాదు. నిన్నుచూసి, నేను చాలా ఆలోచించాను. నీ జీవితంలో యెలాంటి కష్టాలు యెదుర్కొనవలసి వస్తుందో యీ సంఘంలో వుంటున్న నేను పూర్తిగా గ్రహించగలను వాటన్నింటిని తొలగించి, నీ రూపానికి నీ

గుణానికి తగ్గ అవకాశాలు యివ్వాలని, యెంతో దూరం ఆలోచించి, యెంతో ఆదర్శం అనుకొని నీ దగ్గరకు వచ్చాను. అది నువ్వు గ్రహించుకోలేక పోయావు. ఈ నాడు నీవల్ల నేను, నా వల్ల నీవు భ్రష్టులమై పోయినాం. ఈ అపవాదు యీ అపనింద తప్పించటానికి నేను శాయశక్తులా ప్రయత్నం చేస్తాను నువు కూడా ప్రయత్నం చేసి నా పరువు నిలబెట్టు. అంతకంటె నిన్ను కోరేదేమీలేదు. నేను చెప్పినవాటిల్లో యేఒక్కటీ కూడా పూర్తిగా అర్థం చేసుకోలేవని నాకు తెలుసు, కాని నా ఆవేదన తగ్గేదెట్లా! నేను యెవ్వరితో ఇవన్నీ చెప్పి హృదయభారాన్ని తగ్గించుకోగలను..."సూరిబాబు గజగజ వణికిపోతూ నిలబడివున్నాడు.

అయ్యగారు నాకేం తేలీట్లేదండీ, నన్ను క్షమించండి...హొరుమని ఏడుస్తోంది రుక్కి.

"ఈ పరిస్థితుల్లో నే నేమీ చెయ్యలేను..." చెయ్యి మొహానికి అడ్డం పెట్టుకుని సూరిబాబు చక చక క్రిందకు వెళ్ళిపోయాడు.

రుక్కికి యేదో ఛాయమాత్రంగా బాబుగారి బాధ అర్థమయింది. తన అరచేతిని భూమిమీద గట్టిగా నాలుగైదుసార్లు బాదింది. తనను తాను నిందించుకుంటోంది. తాను చేసిన ఘోరమైన తప్పుకు పశ్చాత్తాపడటానికి కూడా అవకాశం లేకపోయింది. హృదయంలోనుంచి నిప్పు ఆవిర్లు బుసలు కొటుతూ పైకి వచ్చేస్తున్నాయి. తన కల్మషాన్ని దహించేస్తున్నాయా అన్నంత తీవ్రంగా వచ్చేస్తున్నాయి మనస్సు పరిపరివిధాల పోతోంది. తన జీవితాన్నే సమాప్తి చేసుకోవాలని వచ్చిన ఆవేశం ఆక్షణంలోనే మాయమైపోయింది. తాను జీవితంలో యెంతో సుఖం అనుభవించాలని, యెంతో ఆనందంగా గడుపుతూ వుండాలని యేమిటేమిటో కలలుకంటూ వుండేది. తన అందాన్ని చూసి తానే అసూయపడుతూ వుండేది. అలాంటిది యీనాడు జీవితాన్ని సమాప్తిచేసుకోవాలనే ఆలోచన వికృతంగాను, విరుద్ధంగాను తోచింది. అయ్యగారికి తనమూలాన చెడ్డపేరు వచ్చిందని తెలుసుకుంది. దానికి తాను చెయ్యాదగ్గ పనేమిటి ఆలోచించటం మొదలుపెట్టింది, ఓమూల అమ్మ తననియెవరికో అమ్మేసి

డబ్బు సంపాదించాలని ఆశపడుతూ వుంటుంది. అక్క జీవితం అంతా బజారు పాలయింది. అయ్య యేమీ చెయ్యలేనివాడు. ఇక వీళ్ళతో ఉండి లాభం యేమిటి? నాకు వీళ్లతో యేవిధమైన సంబంధమూలేదు. నేను వీళ్ళెవ్వరికీ కనిపించకండా యెక్కడికో దూరంగా వెళ్ళిపోతాను. అక్కడే నా జీవితం క్రొత్తవిధంగా సాగించుకుంటాను. ఇక యీ వూళ్ళో నాకు తావులేదు. ఓ నిశ్చయానికి వచ్చేసింది. ఆ సాయంత్రం బండికి యెవరికీ చెప్పకండా ఆ వూరు వదిలివేసి వెళ్ళిపోవాలని నిశ్చయంచేసుకుంది రుక్కి.

పగలల్లా మండిన సూర్యుడు పశ్చిమా ద్రిలోకి కుంగిపోతున్నాడు. సూరిబాబు గదిలో పిచ్చివాడులాగ పచార్లుచేస్తున్నాడు అటూ యిటూ. అతని బుర్ర వేడెక్కిపోతోంది. ఏమీ ఆలోచన తట్టటంలేదు. చటుక్కున యేదో ఓ వుపాయం తట్టినట్లు వులిక్కిపడ్డాడు. తాను యీ వూరు వదిలిపెట్టి వెళ్ళిపోవాలి. ఈ అపనింద భరించలేను. ఈ అపవాదు సహించలేను అనుకున్నాడు. గబగబ పెట్టెలోకి నాలుగైదు బట్టలు కుక్కేసి, సరిగ్గా బండిటైముకు రైలు స్టేషను చేరుకున్నాడు. గుండెల్లో రైళ్లు పెరుగెత్తుతున్నాయి. ఎరుగున్న వ్యక్తి యెవరైనా కనిపిస్తే వులిక్కిపడుతున్నాడు. ఆవేదనగా రైలురావటానికి యింకా యెంత టైముందో కనుక్కున్నాడు. ఆనాడు కూడా గంట లేటుగానే రైలువచ్చింది. ముచ్చెమట్లు పోసిన సూరిబాబు తెప్పరిల్లి, రైలు వచ్చి ఆగంగానే జనాన్ని నెట్టుకుంటూ ఓ పెట్టెలోకి చొరబడ్డాడు. కూతలు వేసుకుంటూ, రైలు తూర్పుకు సాగిపోయింది.

గుంపులు గుంపులుగా నడుస్తున్న జనంమధ్య శరీరాన్ని దాచుకుంటూ, తానుమాత్రం యెవర్నీ చూడకండా, యెక్కడో జనం వత్తిడిగావున్న మధ్య పెట్టెలో యెక్కేసింది రుక్కి.

చీకట్లను బ్రద్దలు కొట్టుకుంటూ రైలు పడమట మొహం పట్టింది.

రాత్రి వెళ్ళిపోయింది.

తెల్లారేటప్పటికి సూరిబాబు రుక్కిని లేవతీసుకుని వెళ్లాడనే మాట వూరంతా పాక్కిపోయింద.